# జీవకోటి మనుగడలో రసాయనశాస్త్ర పాత్ర అమోఘం

## (అక్టోబర్ 20 – 26 : "జాతీయ రసాయనశాస్త్ర వారేత్సవాలు" సందర్భంగా)

తినడానికి తిండి, కట్టడానికి బట్ట, తల దాచుకోవడానికి గూడు అనే మూడు కనీస నిత్య అవసరాలను తీర్చగల ఏకైన సాధనంగా రసాయనశాస్త్రం నిలుస్తున్నది. తిన్న ఆహారం జీర్ణం కావాలన్నా, శరీరంలోని హానికారక పదార్థాలను తొలగించాలన్నా, నివాస స్థలాలను శుభ్రంగా ఉండాలన్నా, పర్యావరణ పరిరక్షణ జరగాలన్నా, రోగాలు కట్టడి చేయాలన్నా రసాయనశాస్త్రమనే ఆయుధమే మానవాళికి శరణ్యం అని నమ్మాలి. దిన చర్యను ప్రారంభించే టూత్ పేస్ట్/బ్రష్, గుటకలేస్తూ తాగే టీ/కాఫీలు, ఆహారాన్ని ప్రసాదించే పోషకాహారం, వంటలు వండడం, సబ్బులు/డిటర్జెంట్లు, ఆహార పదార్థాల్లో వాడుకునే రసాయనాలు, ప్రాణాపాయ సూక్ష్మజీవులను నశింపజేయడం, టీకాలు/ఔషధాలు, ధరించే వస్త్రాలు, నిష్మణ రంగంలో వాడే మెటీరిల్స్ లాంటివి కెమిస్ట్రీ ప్రసాదించిన వరంగా భావించాలి. అన్ని పదార్థాల్లో దాగిన అణువులు, పరమాణువులు, మౌళిక కణాల్లో దాగిన రహస్యాల గుట్టు విప్పుతూ, మానవాళి సంక్షేమం వైపు వాటి అనువర్తనాలను శోధించే మార్గంగా రసాయనశాస్త్రం నేడు ప్రపంచం ముందు నిలుస్తున్నది. ఆరోగ్యాన్ని కాపాడే ఔషధాలు, పంట దిగుబడులను పెంచే క్రిమికీటక నాశనులు, వైవిధ్యభరిత ఆహార పదార్థాలు, వస్త్ర పరిశ్రమ, రవాణా రంగం, టెక్నాలజీ, పరిశుభ్రత, సౌందర్య సాధనాలు లాంటి అనేక రంగాల్లో రసాయనశాస్త్రమే పునాదిగా నిలుస్తున్నది.

జాతీయ రసాయనశాస్త్ర వారోత్సవాలు–2024 థీమ్:

1986లో అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసిఎస్) చేసిన ఆలోచనల ఫలితంగా 1987 నుంచి ప్రతి ఏట అక్టోబర్ 20 – 26 వరకు నిర్వహింపబడుతున్న "జాతీయ రసాయనశాస్త్ర వారోత్సవాల్లో (నేషనల్ కెమికల్ వీక్)" భాగంగా ప్రపంచ మానవాళికి రసాయనశాస్త్ర ప్రాధాన్యాన్ని ఏకరువు పెట్టడం, సుస్థిరాభివృద్ధిలో రసాయనశాస్త్ర పాత్రను శ్లాఘించుడం, డిజిటల్ యుగంలో రసాయనశాస్త్ర పరిశోధనల ప్రగతిని వివరించడం లాంటి అంశాల్లో అవగాహన కల్పించడం గత మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నది. "జాతీయ రసాయనశాస్త్ర వారోత్సవాలు–2024" థీమ్‌గా "పిక్షర్ ఫర్‌ఫెక్ట్ కెమిస్ట్రీ" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. డిజిటల్ ప్రపంచంలో రసాయనశాస్త్రంలో ముడిపడి ఉన్న ఫోటోకెమిస్ట్రీ, ఇమ్మేజింగ్ ప్రక్రియల్ని జోడించి అత్యాధునిక రసాయనశాస్త్ర ప్రయోగాలు చేస్తూ మానవాళి శ్రేయస్సుకు వినియోగించడం జరిగుతోంది. వీడియోలు, రసాయనశాస్త్ర వస్తువుగా కవితలు, రచనలు, రసాయన ప్రయోగాలు, నిపుణులతో ప్రసంగాలు, పరిశోధనలను ప్రోత్సహించడం, రసాయనశాస్త్రాన్ని బోధించడం, జీవన లక్ష్యంగా మార్చుకోవడం, పలు రకాల పోటీలు నిర్వహిస్తూ నేటి విద్యార్థిలోక మనసును రసాయనశాస్త్ర అధ్యయనం వైపు ఆకర్షించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జాతీయ మోల్ దినోత్సవం–2024:

జాతీయ రసాయనశాస్త్ర వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 23న జాతీయ మోల్ దినోత్సవం ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. రసాయనశాస్త్ర విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ఔత్సాహికులకు అవగాడ్రో సంఖ్య గూర్చి పరిజ్ఞానం ఉంటుంది. అవగాడ్రో సంఖ్యలో (6.023 ని 10 టు ది పవర్ ఆఫ్ 23) అణువులు లేదా పరమాణువులు ఉన్నట్లైతే దానిని ఒక మోల్ అని నిర్వచిస్తారు. ఒక మోల్ పరమాణువుల భారాన్ని పరమాణు భారం అని, అణువుల భారాన్ని అణుభారమని అంటారు. రసాయనశాస్త్రంలో మౌళిక యూనిట్‌గా మోల్ లేదా అవగాడ్రో సంఖ్య నిలుస్తున్నది. ఆ మౌళిక అంశాల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడానికి "మోల్ దినం" వేదికలను వినియోగించుకోవాలి.

రసాయనశాస్త్రానికి ఇరువైపుల పదును ఉంటుంది. దానిని మానవాళి సంక్షేమానికి, విష పదార్థాలతో నశింపజేయడానికి కెమిస్ట్రీ ప్రక్రియల్ని వాడవచ్చు. ఈ విషయాలను ఆకలింపు చేసుకొని కెమిస్ట్రీ విజ్ఞానాన్ని మానవాళితో పాటు ప్రాణికోటి, పర్యావరణాలను కాపాడుకుంటూ మరింత సరళ జీవన విధానాలతో ముందడుగు వేద్దాం, రసాయనశాస్త్రానికి కృతజ్ఞతలు తెలియజేద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బీసీకమిషన్ చైర్మన్‌ని కలిసిన సంచార ముస్లింలు

### – సర్వేచేసి మాకు సమానఅవకాశాలు కల్పించండి

ఖమ్మం, అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి): మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు షేర్ ఆలీ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ ముందు హాజరైన తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘ సభ్యులు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనకబాటులో జీవిస్తున్న సంచార ముస్లింలకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రత్యేకంగా గుర్తించాలని తెలంగాణలో ముస్లిమ్ జనాభాలో సుమారుగా సగం ఉన్న మేము ప్రస్తుతం వివిధ వృత్తుల పరంగా గుర్తించబడుతున్నాము.



– బీసీ–ఈ కేటగిరీలో 14తెగలు ఉన్నాయి ఈసర్వేలో

1. సామాజిక – ఆర్థిక స్థితి:తెలంగాణలో సంచార ముస్లిమ్‌లు సామాజిక, ఆర్థిక ప్రమాణాలలో ఎస్సీలు, ఎస్టీల కంటే వెనక్కి ఉన్నారు. సమగ్ర సర్వే వారి ప్రస్తుత పరిస్థితి, అవసరాలను ఖచ్చితంగా అంచనా వేయడం. 2.విద్యా వెనుకబాటు:ఇతర సముదాయాలతో పోలిస్తే సంచార ముస్లిమ్‌లలో విద్యా సాధనలో ముఖ్యమైన వ్యత్యాసం ఉంది. సర్వే వారి విద్యాస్థితిని మెరుగు పరిచేందుకు ప్రత్యేకముగా గుర్తించడంలో సహాయపడుతుంది.

3.ఉద్యోగ సవాళ్లు:సంచార ముస్లిమ్‌లు లబ్ధికరమైన ఉద్యోగం పొందడంలో కష్టాలను ఎదుర్కొంటున్నారు. సర్వే డేటా లక్ష్యబద్ధమైన ఉద్యోగ సృష్టి, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడంలో విలువైనది. 4.రాజకీయ నిగమనం జనాభాలో ప్రధాన భాగాన్ని కలిగి ఉన్నా, సంచార ముస్లిమ్‌లు రాజకీయ రంగాలలో తరచుగా అణగారినట్టు ఉంటారు. కాబట్టీ సర్వే ఈ సమస్య యొక్క విస్తృతను వెల్లడించడంలో, దీనిని పరిష్కరించేందు కు విధానాలను రూపొందించడంలో సహాయపడుతుంది. 5.లక్ష్యమైన ప్రణాళిక అవసరం

మా వెనుకబడిన స్థితిని దృష్టిలో పెట్టుకుంటే, సంచార ముస్లిమ్‌లకు ప్రభుత్వానికి ప్రత్యేక దృష్టి పెట్టేందుకు, లక్ష్యబద్ధమైన ప్రణాళిక కోసం అవసరం సమగ్ర సర్వే ప్రత్యేక సంక్షేమ పథకాలు, విధానాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన డేటాను అందిస్తుంది.

ఈ సర్వేలో సంచార ముస్లిమ్‌ల సర్వే ప్రభుత్వానికున్న వెనుకబడిన సమూహాలను అభివృద్ధి లో లక్ష్య సాధనకు పూర్తిగా సహాయం పడుతుందని మేము నమ్ముతున్నాము. కాబట్టీ మా ప్రతిపాదనలు అనుకూలంగా పరిశీలించాలనీ, మా అభివృద్ధికై సరైన నివేదిక అందించాలని బీసీ కమిషన్‌కు మేము కోరడం జరిగింది. వచ్చే సమగ్ర కుటుంబ సర్వేలో సంచార ముస్లిమ్‌లను ప్రత్యేకంగా గుర్తించాలని కోరుకుంటున్నాము.

ఈ సర్వే మా సమాజం ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను గుర్తించడం, పరిష్కరించడం దిశగా ఒక ముఖ్యమైన మొదటి అవుతుంది. కాబట్టి కమిషన్ ప్రతిస్పందన సానుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ స్థాపకులు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షబ్బీర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమిల్, యూత్ ప్రెసిడెంట్ ఎండి ఫరూక్, దూదేకుల సంఘం అధ్యక్షుడు సత్తార్ సాహెబ్, అడ్వకేట్ ఇస్మాయిల్, ఖమ్మం జిల్లా సభ్యులు అక్బర్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను దృష్ట్యా సన్నద్ధతను సమీక్షించేందుకు సమావేశమైన జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను దృష్ట్యా సన్నద్ధతను సమీక్షించేందుకు కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి వి సోమనాథన్ అధ్యక్షతన జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ (ఎన్ సిఎంసి) సమావేశం జరిగింది.

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రస్తుత స్థితిగతులను భారత వాతావరణ శాఖ (ఐఎండి) డైరెక్టర్ జనరల్ కమిటీకి వివరించారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి అక్టోబర్ 22 ఉదయం వాయుగుండంగా , అక్టోబర్ 23 నాటికి తూర్పు మధ్య బంగాళా ఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత వాయువ్య దిశగా పయనించి అక్టోబర్ 24 ఉదయం ఒడిశా–పశ్చిమబెంగాల్ తీరాలకు సమీపంగా వాయువ్య బంగాళా ఖాతం చేరుకోనుంది. వాయువ్య దిశగా కదులుతూనే అక్టోబర్ 24 అర్ధరాత్రి, 25వ తేదీ తెల్లవారు జామున తీవ్ర తుపానుగా గంటకు 100–110–120 కిలోమీటర్ల వేగంతో పూరీ, సాగర్ దీవుల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటే అవకాశం ఉంది.

తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్న ప్రాంతాల లోని ప్రజలను రక్షించడానికి తీసుకుంటున్న సన్నాహక చర్యలు, స్థానిక యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు కమిటీకి వివరించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లను కూడా సిద్ధం చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తగినన్ని షెల్టర్లు, విద్యుత్ సరఫరా, మందులు, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచారు. సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముంపు ప్రాంతాల ప్రజలను గుర్తించారు.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్.డిఆర్ఎఫ్) పశ్చిమ బెంగాల్లో 14 బృందాలను, ఒడిశాలో 11 బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆర్మీ, నేవీ, కోస్ట్ గార్డ్ కు చెందిన రక్షణ, సహాయ బృందాలతో పాటు నౌకలు, విమానాలను సిద్ధంగా ఉంచారు. పారాదీప్, హల్దియా రేవులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సలహాలు పంపుతున్నారు. విద్యుత్, టెలీ కమ్యూనికేషన్లకు అంతరాయం ఏర్పడితే తక్షణ పునరుద్ధరణ కోసం, పరిస్థితిని పర్యవేక్షించడం కోసం విద్యుత్, టెలికమ్యూనికేషన్ శాఖలు అత్యవసర బృందాలను నియమించాయి.

కేంద్ర సంస్థలు , ఒడిశా , పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాల సన్నద్ధత చర్యలను సమీక్షించిన క్యాబినేట్ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వాలు , కేంద్ర సంస్థలు అవసరమైన అన్ని నష్ట నివారణ , ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాణనష్టాన్ని పూర్తిగా నివారించడం, ఆస్తులు, మౌలిక సదుపాయాల నష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా ఉండాలని, నష్టం జరిగితే అతి తక్కువ సమయంలో అత్యవసర సేవలను పునరుద్ధరించాలని సూచించారు.

సముద్రంలో ఉన్న మత్స్యకారులను వెనక్కి రప్పించాలని, ముంపు ప్రాంతాల ప్రజలను సకాలంలో తరలించేలా చూడాలని కేబినెట్ కార్యదర్శి తెలిపారు. అన్ని కేంద్ర సంస్థలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని, సహాయం కోసం అందుబాటులో ఉంటాయని ఆయన ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా భారీ వర్షాల కారణంగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలలోని డ్యామ్ ల నుంచి నీటి విడుదలను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ కార్యదర్శి స్పష్టం చేశారు.

ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, మత్స్య, విద్యుత్, ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా శాఖ కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్ అదనపు ప్రధాన కార్యదర్శి, టెలికమ్యూనికేషన్ శాఖ సభ్యుడు (టెక్నికల్), చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఐఎస్సీ) సిబ్బంది నుంచి చైర్మన్ వరకు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంకా జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సభ్య కార్యదర్శి, భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్, ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్, హోం మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు.


కంచనపల్లి రవికాంత్
కవితా సంపుటి
నానీ కిరణాలు
ఆవిష్కరణ సభ
ముఖ్య అతిథి & ఆవిష్కర్త
డా. ఎన్.గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
పూర్వ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం
అధ్యక్షులు
డా. ఎస్. రఘు
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
ఆచార్య సూర్యాధనంజయ్
పూర్వాధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
గౌరవ అతిథి
శ్రీ జి.శ్యాంప్రసాద్ లాల్
అడిషనల్ కలెక్టర్,పెద్దపల్లి జిల్లా
ఆత్మీయ వాక్యాలు
శ్రీ తగుళ్ల గోపాల్
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత
డా. తండ హరీష్ గౌడ్
కవి, విమర్శకులు
ఆహ్వానం


27
అక్టోబర్ 2024
ఆదివారం, ఉదయం
10:00గం.
రవీంద్రభారతి
కాన్ఫరెన్స్‌హాల్
హైదరాబాద్
అందరూ ఆహ్వానితులే!
Bodhi Foundation
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ


# నంద్యాల ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీలో సీఐడీ తనిఖీలు..

అమరావతి, అక్టోబర్ 22: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆగ్రో ఇండస్ట్రీలో ఏపీ సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఉన్నటువంటి ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీలో భారీగా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఈ కంపెనీపై గతంలో పలు అక్రమ ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో సీఐడి అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బాటిలింగ్ యూనిట్లు పలు మద్యం బాటిళ్ల శాంపుల్ నమూనాలు కూడా సేకరించారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఈ ఫ్యాక్టరీలో మద్యం తయారైనట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ కంపెనీలో వైసీపీ పెద్దలకు కూడా భాగస్వామ్య ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలిబుచ్చుతున్నారు.

దాదాపుగా 30 మంది సిఐడి అధికారులు ఈ ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీలో అడుగడుగునా ఉన్నటువంటి ఫ్యాక్టరీ నిబంధనలను రికార్డులను పరిశీలించారు. ఇందులో మద్యం తయారీ అంశాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తుంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలుపుతున్నారు. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి సంబంధించినది. 2014 సంవత్సరంలో ఎంపీకి గెలిచిన మరుక్షణం వైసీపీ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

2019 పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ఎస్పీవై రెడ్డి అకాల మరణం చెందారు. 2019 వ సంవత్సరంలో వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీని పలు విధాలుగా రాజకీయ కారణాలతో వైసీపీ నాయకుల పెద్దల భాగస్వామ్యంతో ఈ ఫ్యాక్టరీని నడుపుతూ వచ్చారని ఆరోపణలు వినిపించాయి. చివరికి మంగళవారం ఏపీ సిఐడి ఆకస్మిక తనిఖీల్లో ఏం బయటపడుతుందో. అధికారులకు ఎలాంటి నివేదిక సమర్పిస్తారో వేచి చూడాల్సిందే..

# ప్రపంచంలో ఉన్నత శిఖరాలకు చేరే సామర్థ్యంగల అత్యంత యువ దేశాలలో భారత్ ఒకటి

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న్యూఢిల్లీలో 'ఎన్‌డిటివి ప్రపంచ సదస్సు–2024లో ప్రసంగించారు. ఈ సందర్భంగా తొలుత ప్రముఖుల ందరికీ స్వాగతం పలుకుతూ– శిఖరాగ్ర సదస్సు అనేక అంశాలపై చర్చిస్తుందన్నారు. వివిధ రంగాల నుంచి హాజరైన ప్రపంచ అగ్రశ్రేణి ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేస్తారని కూడా ఆయన ప్రకటించారు.

గత నాలుగైదేళ్ల ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ– ప్రపంచ భవిష్యత్తు సంబంధిత ఆందోళనలపై చర్చలు ఒక సాధారణ ఇతివృత్తంగా మారిపోయాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా కోవిడ్, ఆ మహమ్మారి అనంతర ఆర్థిక ఒత్తిడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వాతావరణ మార్పు సమస్యలు, కొనసాగుతున్న యుద్ధాలు, సరఫరా శ్రేణిలో వినూత్న మార్పులు, అమాయక జనం మరణాలు, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవలి సంఘర్షణల సవాళ్లు వగైరాలన్నీ ప్రపంచ శిఖరాగ్ర సమావేశాల్లో చర్చనీయాంశాలుగా మారాయని ఆయన పేర్కొన్నారు. అయితే, ఇదే సమయాన భారత్ మాత్రం తన శతాబ్ది వేడుకల నిర్వహణ గురించి చర్చిస్తున్నదని ప్రకటించారు. "ప్రపంచమంతా పీకల్లోతు సంక్షోభంలో మునిగితే, భారత్ ఆశాకిరణంగా ఉద్భవించింద" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థితిగతులు, దాని ముందున్న సవాళ్లతో భారత్ ప్రభావితమైనప్పటికీ, వాటిని అధిగమించగల ఆశావహ దృక్పథం కొరవడలేదని స్పష్టం చేశారు.

ఈ మేరకు "ప్రస్తుత ప్రపంచవ్యాప్త కల్లోల పరిస్థితుల నడుమ భారత్ ఒక్కటే ఆశా కిరణంగా నిలుస్తోందని చెప్పారు. ప్రపంచం వ్యాకులపడితే భారత్ కొత్త ఊపిరి పోస్తుంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. నేటి ప్రపంచ పరిస్థితులు, అనేక దేశాల ముందున్న సమస్యలు భారత్‌ను ప్రభావితం చేసినా, ఈ దేశం ఆశావహ ధోరణిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

"భారత్ నేడు ప్రతి రంగంలోనే కాకుండా, ప్రతి అంశంలో అనూహ్య వేగంతో పురోగమిస్తోంది'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 125 రోజులు పూర్తి కావడాన్ని ప్రస్తావిస్తూ– ఈ సమయంలో దేశ ప్రగతి కోసం చేసిన కృషిని వివరించారు. ఈ మేరకు పేదల కోసం 3 కోట్ల కొత్త పక్కా ఇళ్లకు ఆమోదం, రూ.9 లక్షల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, 15 కొత్త వందే భారత్ రైళ్ల ప్రారంభం, 8 కొత్త విమానాశ్రయాలకు శంకుస్థాపన, యువత కోసం రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటనలను ఆయన ఉదాహరించారు. అలాగే రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.21,000 కోట్లు బదిలీ చేశామని, దేశంలో 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత చికిత్స పథకం, దాదాపు 5 లక్షల ఇళ్ల పైకప్పు మీద విద్యుదుత్పాదన యూనిట్ల ఏర్పాటు, 'తల్లి పేరిట ఓ మొక్క' కార్యక్రమం కింద 90 కోట్ల మొక్కలు నాటడం వంటి కార్యకలాపాలు చేపట్టామని వివరించారు. దీంతోపాటు 12 కొత్త పారిశ్రామిక సంగమాలకు ఆమోదం తదితరాలను కూడా ఆయన ఏకరవు పెట్టారు. దీంతో సెన్సెక్స్–నిఫ్టీ సూచీలు 5 నుంచి 7 శాతందాకా వృద్ధి నమోదు చేశాయన్నారు. భారత విదేశీ మారక నిల్వలు 700 బిలియన్ డాలర్ల స్థాయికి పెరిగినట్లు పేర్కొన్నారు. గడచిన 125 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా నిర్వహించిన అంతర్జాతీయ కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ 'ఎస్‌ఎంయు', గ్లోబల్ ఫిన్‌టెక్ వేడుకలు, గ్లోబల్ సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ, నవ్య–పునరుత్పాదక ఇంధనం, పౌర విమానయానంపై అంతర్జాతీయ సదస్సు వంటివాటిని ఉదహరించారు. "ఇది కేవలం కార్యక్రమాల జాబితా కాదు... దేశానికి దిశానిర్దేశం సహా భారత్‌పై ప్రపంచానికిగల ఆశాభావాన్ని ప్రస్ఫుటం చేసే ఆశల జాబితా" అని అభివర్ణించారు. ఇవన్నీ ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించే అంశాలని, వీటిపై చర్చలకు భారత్ కీలక వేదికగా మారిందని ప్రధాని గుర్తుచేశారు.

ప్రస్తుత ప్రభుత్వం మూడో దఫా అధికారంలోకి వచ్చాక దేశ ప్రగతి మరింత వేగం పుంజుకోవడంతో రేటింగ్ సంస్థలన్నీ తమ ముందస్తు అంచనాలను సవరించక తప్పలేదని ఆయన అన్నారు. ఈ మేరకు భారత్‌లో పెట్టుబడులపై మార్క్ మోబియస్ వంటి మార్కెట్ నిపుణుడి ఉత్సాహాన్ని ప్రస్తావిస్తూ– అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు తమ నిధుల్లో 50 శాతాన్ని మన షేర్ మార్కెట్లో పెట్టాలని ఆయన సూచించినట్లు గుర్తుచేశారు. "భారత్‌లో భారీ పెట్టుబడులపై ఇలాంటి అనుభవంగల నిపుణులిచ్చే సలహా మన సామర్థ్యంపై ప్రపంచానికి బలమైన సందేశాన్నిస్తుంది'' అని పేర్కొన్నారు.

''భారత్ ఇవాళ వర్ధమాన దేశంగా మాత్రమే కాకుండా ప్రపంచ శక్తిగానూ వేగంగా ఎదుగుతోంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పేదరికం విసిరే సవాళ్లపై పూర్తి అవగాహన ఉన్నందున ప్రగతికి బాటలు వేయడం ఎలాగో మన దేశానికి చక్కగా తెలుసునన్నారు. విధాన రూపకల్పన, నిర్ణయాత్మక ప్రక్రియలు, కొత్త సంస్కరణల విషయంలో ప్రభుత్వం వేగాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకనాటి అలసత్వ ధోరణిని గుర్తుచేస్తూ– ఇలాంటి ఆలోచన దృక్పథం ఉంటే దేశం ముందడుగు వేయజాలదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరిక విముక్తులు కాగా, 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, 16 కోట్ల గ్యాస్ కనెక్షన్ల జారీ వంటి అంశాలను ఉదహరిస్తూ, ఇక్కడితో అంతా అయిపోలేదని వ్యాఖ్యానించారు.

భారత్ గత పదేళ్లలో 350కిపైగా వైద్య కళాశాలలు, 15కుపైగా 'ఎయిమ్స్' నిర్మించిందని ప్రధాని చెప్పారు. అలాగే 1.5 లక్షల అంకుర సంస్థల ఏర్పాటుతోపాటు 8 కోట్ల మంది యువతకు ముద్ర పథకం కింద రుణాలిచ్చిందని తెలియపారు. అయితే, "ఇదీ సరిపోదు" అంటూ– దేశ యువత నిరంతర పురోగమనం కోసం శ్రమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నత శిఖరాలకు చేరగల అత్యంత యువ దేశాల్లో భారత్ ఒకటని ప్రధానమంత్రి గుర్తుచేశారు. మన యువత సామర్థ్యంతో ఈ లక్ష్యాన్ని మరింత త్వరగా, సమర్థంగా అందుకోగల అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు.

దేశం ఆలోచన ధోరణిలో మార్పును ప్రస్ఫుటం చేస్తూ– ఏ ప్రభుత్వమైనా తన విజయాలను మునుపటి ప్రభుత్వాల హయాంతో పోల్చి చూసుకుంటుందని ప్రధాని అన్నారు. ఆ మేరకు 10–15 ఏళ్లు వెనక్కి చూస్తే వాటిని అధిగమించడాన్ని ఒక విజయంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. అయితే, భారత్ నేడు ఈ విధానాన్ని మార్చేసిందని, మునుపటి విజయాల ప్రాతిపదికన కాకుండా భవిష్యత్తు దిశను బట్టి ప్రస్తుత ముందంజపై అంచనాలు వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. దూరదృష్టితో ముందంజ వేసే దృక్పథాన్ని విశదీకరిస్తూ... భవిష్యత్తు–కేంద్రక విధానంతో దేశం ప్రగతి పథంలో పయనిస్తున్నదని చెప్పారు. "మన దేశం 2047 నాటికి వికసిత భారత్ కావాలన్నది మా లక్ష్యం మాత్రమే కాదు... అది 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతిబింబం. అది ప్రజా భాగస్వామ్యం కోసం నిర్వహించే ఓ కార్యక్రమం కాదు... జాతి ఆత్మవిశ్వాసాన్ని చాటే ఉద్యమం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. వికసిత భారత్ దార్శనిక పత్రం రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినపుడు లక్షలాది ప్రజలు తమ సూచనలు, సలహాలతో సహకరించారని ఆయన గుర్తుచేశారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకూ... వివిధ సంస్థల ద్వారా చర్చోపచర్చలు సాగాయన్నారు. అనంతరం అందరి అభిప్రాయాలు, ఆలోచనలను ప్రభుత్వం క్రోడీకరించి, రాబోయే 25 ఏళ్లకు తగిన లక్ష్యాలను నిర్దేశించిందని వివరించారు. "వికసిత భారత్‌పై నేటి మన చర్చలు జాతీయ చైతన్యంలో భాగం మాత్రమే కాదు... ప్రజాశక్తిని జాతి శక్తిగా మార్చే వాస్తవ ఉదాహరణగా రూపొందాయి" అన్నారు.

కృత్రిమ మేధ (ఎఐ) గురించి ప్రస్తావిస్తూ– ఈ 21వ శతాబ్దం 'ఎఐ' యుగమని, ప్రపంచ వర్తమానం–భవిష్యత్తు రెండూ దీనితో ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భారత్‌కు రెండు రకాల 'ఎఐ' సానుకూలత ఉందంటూ– అందులో ఒకటి 'కృత్రిమ (ఎఐ) మేధ' కాగా, మరొకటి 'ఆకాంక్షాత్మక భారత్' (యాస్పిరేషనల్ ఇండియా) అని అభివర్ణించారు. దేశానికి ఇదొక కొత్త సాంకేతికత మాత్రమే కాదని, యువతకు కొత్త అవకాశాల బాటలు పరిచే మార్గమని స్పష్టం చేవారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 'ఇండియా 'ఎఐ' మిషన్‌'ను ప్రారంభించడంతోపాటు ఆరోగ్య సంరక్షణ, విద్య, అంకుర సంస్థల వంటి రంగాల్లో దీని వినియోగం పెంపుపైగా దృష్టి సారించామని తెలిపారు. ''అంతర్జాతీయ స్థాయి 'ఎఐ' పరిష్కారాల ప్రదానానికి భారత్ సిద్ధంగా ఉంది. క్వాడ్ వంటి వేదికల ద్వారా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా మేము కీలక కార్యక్రమాలు చేపడుతున్నాం'' అని ఆయన వెల్లడించారు. అలాగే ఆకాంక్షాత్మక భారత్‌ను ప్రస్తావిస్తూ– సామాన్య, మధ్యతరగతి పౌరుల జీవన నాణ్యత మెరుగుదలసహా చిన్న వ్యాపారాలు, 'ఎంఎస్‌ఎంఇ'లు, యువతరం, మహిళల సాధికారత వంటివి ప్రభుత్వ విధాన రూపకల్పన ప్రక్రియలలో ప్రధానాంశాలుగా ఉన్నాయన్నారు. అనుసంధానం దిశగా దేశం సాధించిన అద్భుత పురోగమనాన్ని జాతి ఆకాంక్షలు నెరవేర్చడంలో ఒక ఉదాహరణగా ప్రధానమంత్రి ఉటంకించారు. ప్రగతిశీల సమాజానికి, విశేషించి... భారత్ వంటి సువిశాల, వైవిధ్యభరిత దేశానికి తగిన సమ్మిళిత, వేగవంతమైన భౌతిక అనుసంధానంపై ప్రభుత్వం నేడు దృష్టి సారించిందని చెప్పారు.

ఈ క్రమంలో విమాన యానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని ప్రధాని తెలిపారు. 'హవాయి చెప్పులు' ధరించే అతి సామాన్యులు కూడా ఆకాశయానం చేయగలగాలన్నదే చౌక విమాన ప్రయాణంపై తన ఆలోచనగా వెల్లడించారు. తదనుగుణంగా రూపొందిన 'ఉడాన్' పథకానికి ఇప్పుడు 8 సంవత్సరాలు నిండాయని గుర్తుచేశారు. దేశంలోని 2, 3వ అంచె నగరాల్లో కొత్త విమానాశ్రయ నెట్‌వర్క్‌లు ప్రజలందరికీ విమాన యానాన్ని అందుబాటులోకి తెచ్చాయని తెలిపారు. దీనికింద ఇప్పటిదాకా నడిపిన 3 లక్షల విమాన సర్వీసులు 1.5 కోట్ల మంది సామాన్య ప్రయాణికులను గమ్యం చేర్చాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పథకం కింద నేడు చిన్న పట్టణాలను కలుపుతూ 600కుపైగా మార్గాల్లో విమాన సేవలు లభిస్తున్నాయని తెలిపారు. దేశంలో 2014నాటికి 70 విమానాశ్రయాలు ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 150 దాటిందని చెప్పారు.

భారత యువతను ప్రపంచ వృద్ధికి సారథులుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వ నిబద్ధతను ప్రధాని ఉటంకించారు. ఈ మేరకు విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఉపాధి కల్పనపై నిశితంగా దృష్టి సారించామని గుర్తుచేశారు. గత 10 ఏళ్ల కృషి ఫలితాలకు నిదర్శనంగా 'టైమ్స్' పత్రిక ఉన్నత విద్య ర్యాంకులతోపాటు పరిశోధన నాణ్యతలోనూ అంతర్జాతీయంగా భారత్ స్థానం ఎగువకు దూసుకెళ్లిందని తెలిపారు. అలాగే గత 8–9 ఏళ్లుగా అంతర్జాతీయ ర్యాంకులలో మన విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం 30 నుంచి 100కు పెరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు 'క్యుఎస్' వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకులలో భారత్ స్థాయి పదేళ్లలో 300 శాతానికి మించి పెరిగిందన్నారు. అలాగే దేశం నుంచి దాఖలైన పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌ల సంఖ్య రికార్డు స్థాయికి చేరిందని ప్రధాని చెప్పారు. ప్రపంచంలోని 2,500కుపైగా కంపెనీలకు భారత్‌లో పరిశోధన కేంద్రాలున్నాయని తెలిపారు. మరోవైపు అంకుర సంస్థల వ్యవస్థ అనూహ్య వృద్ధిని సాధిస్తుండగా, పరిశోధన–ఆవిష్కరణలకు మన దేశం ప్రపంచ కూడలిగా మారుతున్నదని చెప్పారు.

ప్రపంచానికి విశ్వసనీయ మిత్రదేశంగా భారత్ ప్రాముఖ్యం విస్తరిచడాన్ని ప్రస్తావిస్తూ– అనేక రంగాల్లో మానవాళి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయడంలో మన దేశం ముందుంటుందని శ్రీ మోదీ అన్నారు. కోవిడ్–19 మహమ్మారి పరిస్థితులను ప్రస్తావిస్తూ– ఆనాటి సంక్షోభం నడుమ మందులు, టీకాల సరఫరా సామర్థ్యం సాధించిన మనకు లక్షల కోట్ల డాలర్లు ఆర్జించే అవకాశం ఉందని గుర్తుచేశారు. "ఆనాడు మనం భారీ ఆదాయం సంపాదించే అవకాశాన్ని వాడుకుని ఉంటే మానవత్వమనే సుగుణాన్ని మనం పోగొట్టుకుని ఉండేవారం. మన విలువలు అటువంటివి కావు కాబట్టే– ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి నుంచి మానవాళి రక్షణ లక్ష్యంగా వందల దేశాలకు మందులు, ప్రాణరక్షక టీకాలను సరఫరా చేశం" అని ఆయన వివరించారు. "అటువంటి సంక్లిష్ట సమయంలో ప్రపంచానికి మన దేశం చేయూతనివ్వడం నాకెంతో సంతృప్తినిచ్చింది" అన్నారు.

దృఢమైన అంతర్జాతీయ సంబంధాలు ఏర్పరచుకోవడంపై భారత్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ– నామమాత్రపు బంధాలను భారత్ విశ్వసించదని, బాంధవ్యానికి నమ్మకం, విశ్వసనీయతలే పునాదులని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దృక్పథాన్ని ప్రపంచం కూడా అవగతం చేసుకుంటున్నదని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలతో భారత్ సామరస్య పూర్వక సంబంధాలను వివరిస్తూ– "భారత పురోగమనంపై ప్రపంచంలో ఎక్కడా ఈర్ష్య, అసూయ కనిపించవు" అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు "మన ప్రగతి యావత్ మానవాళికీ ప్రయోజనకరం కాబట్టి, ప్రపంచం భారత పురోగమనాన్ని హర్షిస్తుంది" అన్నారు. ప్రపంచ వృద్ధికి భారత్ గతంలోనూ సానుకూల పాత్ర పోషించిందని, దీంతోపాటు మన ఆలోచనలు, ఆవిష్కరణలు, ఉత్పత్తులు శతాబ్దాలుగా అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేశాయని శ్రీ మోదీ గుర్తుచేశారు. వలసపాలన పర్యవసానంగా పారిశ్రామిక విప్లవాన్ని భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని ప్రధాని అన్నారు. అయితే, "ఇది పరిశ్రమ 4.0 శకం. ఇప్పుడు మనం ఎవరికీ బానిసలం కాదు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ముందడుగు వేయడానికి మనం నడుం బిగించాం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పరిశ్రమ 4.0కు తగిన నైపుణ్య సముపార్జన, మౌలిక సదుపాయాల కల్పన దిశగా భారత్ వేగంగా ముందుకెళ్తోందని ప్రధాని ఉద్ఘాటించారు. గత దశాబ్దంలో భారత్ జి–20కి అధ్యక్షత వహించడంతోపాటు జి–7 శిఖరాగ్ర సమావేశం సహా అనేక అంతర్జాతీయ వేదికలపై మన సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల (డిపిఐ)పై కీలక చర్చలకు సూత్రధారిగా వ్యవహరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మన ఆధార్, డిజిలాకర్ వంటి ఆవిష్కరణలను ప్రశంసించిన పాల్ రోమర్‌తో తన చర్చలను ప్రస్తావిస్తూ– "ప్రపంచం మొత్తం నేడు మన యొక్క 'డిపిఐ'ల వైపు దృష్టి సారించింది" అన్నారు. "ఇంటర్నెట్ యుగంలో తొలి ప్రయోజనం పొందిన దేశాల జాబితాలో భారత్ లేదు. అయితే, ఆ ప్రయోజనం పొందిన దేశాల్లో ప్రైవేట్ వేదికలు డిజిటల్ రంగాన్ని ముందుకు నడిపించాయని శ్రీ మోదీ వివరించారు.

# కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ భూతం కలకలం

**-జూనియర్లను వేధించిన సీనియర్లు**
**-గడ్డాలు మీసాలతో తిరగకూడదనీటూ హుకుంజారీ**
**-ఆన్ లైన్ పేమెంట్ యాప్ లు చెప్పినవే వేయాలని ఆదేశం**
**-బెంబేలెత్తిన జూనియర్లు అధ్యాపకుల దృష్టికి**
**-తమకేమీ ఫిర్యాదు అందలేదంటున్న ప్రిన్సిపాల్**
**-విచారణ జరిపించి ర్యాగింగ్ జరిగితే చర్యలు తీసుకుంటామని ప్రకటన**

కర్నూలు , అక్టోబర్ 22: కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపుతుంది. నూతన సంవత్సరం తరగతులు ప్రారంభమై పట్టుమని 15 రోజులు గడవకముందే కొంతమంది జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ కు గురిచేసిన ఘటన వెలుగు చూసింది. జూనియర్ విద్యార్థులు మీసాలు, గడ్డాలు తీసేసి తరగతులకు రావాలని సీనియర్లు హుకుం చేస్తున్నారని కొంతమంది జూనియర్ విద్యార్థులు కళాశాల అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లారు. చివరకు కళ్లజోడు కూడా తాము చెప్పిన తర్వాతే ధరించాలని భయపెట్టారని జూనియర్లు ఆరోపిస్తున్నారు.

ఆకడమిక్ ఆన్ లైన్ యాప్ లు తాము చెప్పినవే తీసుకోవాలని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. తరగతులు అయిన వెంటనే గుంపులు గుంపులుగా వెళ్లి క్యాంపస్ లోనే జూనియర్లను ర్యాగింగ్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. మూడు రోజుల క్రితమే కాలేజీలో ర్యాగింగ్ పై ప్రిన్సిపాల్ యాంటీ ర్యాగింగ్ సమావేశం నిర్వహించగా? ఇందుకు ఎస్పీ బిందు మాధవ్ కూడా హాజరయ్యారు. ర్యాగింగ్ నేరమని, ర్యాగింగ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నత స్థాయి అధికారులు హెచ్చరించినా ర్యాగింగ్ లకు పాల్పడటం గమనార్హం. వాస్తవంగా కర్నూలు మెడికల్ కళాశాలలో ఈనెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.

గత ఏడాది కూడా ర్యాగింగ్ తో విద్యార్థుల పేరెంట్స్ యూజీసీకి ఫిర్యాదు చేశారు. కమిటీ నియమించి విచారించినా ఎవరిపైనా చర్యలు తీసుకోని ఫలితంగా ఈ ఏడాది మళ్లీ విద్యార్థులకు ర్యాగింగ్ తప్పడం లేదు. గత ఏడాది మెడికల్ కాలేజీ మేన్స్ హాస్టల్ లో గంజాయి కూడా లభ్యమైంది. మెడికల్ కాలేజీ అధికారులపై తీవ్రస్థాయిలో విమర్శలున్నాయి. అయితే, ర్యాగింగ్ జరిగినట్లు ఫిర్యాదు రాలేదన్నారు ప్రిన్సిపాల్ చిట్టి నర్సమ్మ.. హాస్టల్ కి వెళ్లి కొత్త విద్యార్థులతో మాట్లాడానని, ర్యాగింగ్ జరిగినట్లు విద్యార్థులు చెప్పలేదనన్నారు ప్రిన్సిపాల్. చెప్పడానికి విద్యార్థులకు భయం ఉంటే తనకు వాట్సాప్ లో, ఫోన్ చేసి అయినా ఫిర్యాదు చేయవచ్చంటున్నారు ప్రిన్సిపాల్. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఫిర్యాదు చేయవచ్చున్నారు. ర్యాగింగ్ చేసినట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు ప్రిన్సిపాల్.

ప్రస్తుతం వచ్చిన ర్యాగింగ్ ఆరోపణలపై కమిటీ నియమించి విచారణ నిర్వహిస్తామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టినర్సమ్మ వెల్లడించారు. దశాబ్దం క్రితం కర్నూలు మెడికల్ కళాశాలలో జరిగిన ర్యాగింగ్ కేసులో ముగ్గురు విద్యార్థులను సస్పెన్షన్ చేశారు. వారిపై కోర్టులో కూడా రుజువు కావడంతో.. శిక్ష పడిన సంగతి విధితమే. ఈ ఘటన తర్వాత మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా కళాశాల అధ్యాపకులు జాగ్రత్త పడుతూ వచ్చారు. అయినప్పటికీ అడపాదడపా కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రతి సంవత్సరం ర్యాగింగ్ జరగకుండా కళాశాల అధ్యాపకులు, పోలీసు విభాగంతో కలిసి జూనియర్లు, సీనియర్ల మధ్య సఖ్యత కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇంత నిర్వహిస్తున్నా ర్యాగింగ్ భూతం మాత్రం కర్నూలు మెడికల్ కళాశాలని వదలడం లేదు.

# రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ ఉద్యమ బాట.. జోగు రామన్న




ఆదిలాబాద్, అక్టోబర్ 22రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ ఉద్యమ బాట చేపడుతుందని, ఈనెల 24న ఆదిలాబాద్ లో నిర్వహించనున్న బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోగు రామన్న సర్కార్ తీరుపై నిప్పులు చెరిగారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, రైతు భరోసా ఎగ్గొట్టి ప్రభుత్వం రైతుల ఉసురు తీసుకుంటోందన్నారు. ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మహిళలకు ఉచిత బస్సు మినహా మిగతా గ్యారంటీలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేనీ రాష్ట్రంగా పథకాలు అమలు చేస్తే, 300 రోజుల పాలనలో ఇప్పటికీ 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని జోగు రామన్న ఆరోపించారు. ఎకరానికి తమ ప్రభుత్వం పదివేల రైతుబంధు ఇస్తే, అవహేళన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే రూ.15,000 ఇస్తామని నమ్మించి మోసగించారన్నారు. కేబినెట్ సబ్ కమిటీ పేరిట కాలయాపన చేస్తూ రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం తీరును రాష్ట్రవ్యాప్తంగా ఎండగడతామన్నారు. పత్తికి గుజరాత్ మార్కెట్లో ఒక ధర కల్పించి రాష్ట్రంలో రూ.7520 ప్రకటించడం పట్ల ఎద్దేవా చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, పెళ్లిళ్లు చేసుకున్న పేదలకు తులం బంగారం, రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఉచిత కరెంటు పేరిట మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశారని ధ్వజమెత్తారు.

ఈనెల 24న కేటీఆర్ శంఖారావం..

రైతాంగ సమస్యలే ప్రధాన ఏజెండాగా కులమత రాజకీయాలకు అతీతంగా రైతు ఉద్యమాలను చేపడుతున్నామని జోగు రామన్న తెలిపారు. ఈనెల 24న ఆదిలాబాద్ లో మాజీ మంత్రి కేటీఆర్ శంఖారావం పూరించనున్నారని, ఈ బహిరంగ సభకు రైతులందరూ హాజరుకావాలని జోగు రామన్న కోరారు. రైతు సమస్యలపై నిలదీస్తే ప్రశ్నించే గొంతుకులపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తే తనపై కేసులు పెట్టారని, 420 హామీలు ఇచ్చి మోసగించిన సీఎం రేవంత్ రెడ్డిపై 420 చీటింగ్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద, రోకనీడ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ రమేష్, కౌన్సిలర్లు అల్లాల అజయ్, పవన్ నాయక్, రంగినేని శ్రీనివాస్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో బొగ్గు పరిశ్రమ పాత్ర కీలకం: శ్రీ జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు, లిగ్నైట్ గనులకు సంబంధించిన స్టార్ రేటింగ్ అవార్డుల ప్రదానోత్సవాన్నీ, మైన్ డెవలపర్స్ లేదా ఆపరేటర్ల (ఎండిఒ) అంశంపై వాటాదారుల సంప్రదింపులను బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం ఢిల్లీలో విజయవంతంగా నిర్వహించింది. ఇదే సందర్భంలో జాతీయ స్థాయి కోల్ డైరెక్టరీని కూడా విడుదల చేసింది. బొగ్గు, లిగ్నైట్ గనుల అసాధారణ పనితీరును గుర్తించడం, కీలక భాగస్వాములతో సంప్రదింపులు జరపడం, బొగ్గు రంగంపై విలువైన అభిప్రాయాలను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, గౌరవ అతిథిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన విద్యుత్ మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, ఎంఒఇఎఫ్ అండ్ సిసి, డిజిఎంఎస్ లకు సంబంధించిన ముఖ్య సమస్యలను పరిష్కరించడానికి ఎండిఒ భాగస్వాములతో అంతరంగిక సదస్సును నిర్వహించారు. ఎండిఒలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సమగ్ర అవగాహనను పెంపొందించడం, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ సదస్సు దృష్టి సారించింది.

ఈ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు చర్చలో చురుగ్గా పాల్గొని, ఎండిఒలు లేవనెత్తిన సమస్యలపై తమ ఆలోచనలను, అభిప్రాయాలను అందించారు. ఎండీవోలకు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి బొగ్గు ఉత్పత్తి, రవాణాకు అడ్డంకులను తొలగించడానికి కలిసి పనిచేయాలని వారు స్పష్టం చేశారు. బొగ్గు రంగానికి మరింత బాధ్యతాయుతమైన, సంఘటిత సానుకూల వ్యవస్థను నిర్మించే దిశలో ఒక ముఖ్యమైన స్పందనగా ఈ సదస్సు నిలిచింది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి తన ప్రధానోపన్యాసంలో, బొగ్గు ఉత్పత్తిని పెంచడంలో ఎండిఒ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ఎండీవోల కృషి కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తూ, రాబోయే సంవత్సరాల్లో ఇంధనానికి డిమాండ్ పెరుగుతుందని, బొగ్గు ప్రధాన ఇంధన వనరుగా ఉంటుందని పేర్కొన్నారు.

మన దేశ పురోగతిని ముందుకు నడిపించడంలో బొగ్గు పరిశ్రమ ఒక కీలక శక్తిగా ఉందని, సమర్థవంతమైన ఎండిఓ భాగస్వామ్యం బొగ్గు రంగంలో ఆత్మనిర్భరతను సాధించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను మరింత ముందుకు తీసుకువెళుతూ దిగుమ తులను తగ్గించడానికి , బొగ్గు రంగంలో స్వయం సమృద్ధిని పెంచడానికి గణనీయంగా దోహదం చేస్తోందని మంత్రి చెప్పారు.

గనుల తవ్వకాల కోసం భూములను ఇచ్చిన వారి త్యాగాలను ప్రస్తావిస్తూ, గని కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యం గురించి మంత్రి వివరించారు. గని కార్మికులందరి పట్ల మానవతా ధోరణితో వ్యవహరించాలని ఆయన అన్నారు.

దిగుమతులను తగ్గిస్తూ దేశీయ బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. పాత గనుల మూసివేత అవసరాన్ని ప్రస్తావిస్తూ.. గనుల మూసివేత కార్యకలాపాలకు సమష్టి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. వచ్చే 3-4 ఏళ్లలో మూసివేత పూర్తికాని ఒక్క గని కూడా ఉండకూడదని మంత్రి అన్నారు. ఈ క్లిష్టమైన రంగంలో భారతదేశం ప్రపంచానికి ఒక ప్రమాణంగా నిలవాలని, బాధ్యతాయుతమైన గనుల మూసివేత పద్ధతుల్లో ముందుండాలని సూచించారు. అవార్డు గ్రహీతలందరినీ అభినందించి.. సమన్వయంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు.

బాధ్యతాయుతమైన పద్ధతులు, భద్రత, పర్యావరణ ప్రమాణాల పట్ల నిబద్ధత అవసరమని శ్రీ కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బొగ్గు గనుల రంగంలో సుస్థిరత, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి సమష్టి నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. ఇది దేశానికి మరింత సురక్షితమైన ఇంధన భవిష్యత్తుకు మార్గాన్ని సుగమం చేస్తుందని అన్నారు.

గౌరవ అతిథి, కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే మాట్లాడుతూ.. భారతదేశ బొగ్గు రంగంలో ఎండిఒల పాత్రపై తన ఆలోచనలను పంచుకున్నారు. భారతదేశ బొగ్గు రంగంలో ఎండిఒలు ఒక కీలకమైన భాగమని పేర్కొన్నారు. నేటి చర్చలు మన దేశంలో బొగ్గు గనుల భవిష్యత్తును రూపొందించడంలో పురోగమిస్తున్న ఉన్న ప్రధాన భాగస్వాములను ఏకతాటి పైకి తెచ్చాయని అన్నారు. బొగ్గు పరిశ్రమ సుస్థిర, సమర్థవంతమైన వృద్ధికి ప్రభుత్వం, ప్రైవేటు రంగం మధ్య సహకారం కీలకమని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అవార్డు గ్రహీతలను మంత్రి అభినందించారు. . పర్యావరణపరంగా సుస్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించడంలో స్టార్ రేటింగ్ సిస్టమ్ ప్రాముఖ్యతను వివరించారు.

బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ... పెరుగుతున్న బొగ్గు గనుల విస్తీర్ణం, ఎండిఒల కీలక పాత్రను వివరించారు. ఈ పరిశ్రమలో సమర్థత, సుస్థిరత, దీర్ఘకాలిక వృద్ధి కోసం ఎండిఒ వ్యవస్థ కీలకమైన శక్తిగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నమూనా ప్రైవేట్ రంగం నైపుణ్యం, కార్యాచరణ సామర్థ్యాలను ఉపయోగిం చుకోవడానికి వీలు కల్పించిందని, తద్వారా బొగ్గు-మైనింగ్ రంగాల మొత్తం పనితీరును మెరుగు పరచి ఉత్పత్తిని పెంపునకు దోహదపడిందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ రంగాల మధ్య ఈ సమన్వయంపైనే మన బొగ్గు పరిశ్రమ సమర్థవంతమైన, స్థిరమైన విస్తరణ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బొగ్గు మంత్రిత్వ శాఖ 2022-23 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన 43 గనులను గుర్తించి స్టార్ రేటింగ్ అవార్డులను ప్రదానం చేసింది. ఇందులో 4 గనులు మొదటి స్థానంలో, 2 రెండో స్థానంలో, 6 మూడో స్థానంలో నిలిచాయి. మైనింగ్ కార్యకలాపాలు, పర్యావరణ పద్ధతులు, కార్మికుల భద్రత వంటి కీలక రంగాలలో అసాధారణ పనితీరును గుర్తించడానికి ఈ అవార్డులు ఉపయోగపడతాయి. ఈ రంగంలో ప్రతిభను ప్రోత్సహిస్తాయి. ఈ సందర్భంగా వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తిస్తూ , గనుల మంత్రిత్వ శాఖ ఐజీఓటీ-కర్మయోగి అవార్డులను ప్రదానం చేసింది.

వాటాదారుల సంప్రదింపులు మంత్రిత్వ శాఖ, ఎండిఓల మధ్య బహిరంగ చర్చలకు కీలకమైన వేదికను అందించాయి. కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, ఉత్పాదకతను పెంచడం, కార్యాచరణ సవాళ్లను పరిష్కరించడంపై ఇవి దృష్టి సారించాయి. ఈ ప్రయత్నం బొగ్గు ఉత్పత్తిని పెంచుతుందని, దిగుమతి చేసుకున్న బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, మైనింగ్ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతుందని భావిస్తున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన కోల్ డైరెక్టరీ - బొగ్గు, లిగ్నైట్ ఉత్పత్తి, రంగాల వారీగా తరలింపు (సెక్టోరల్ డిస్పాచ్), బొగ్గు పరిశ్రమకు సంబంధించిన ఇతర కీలక అంశాలపై సమగ్ర సమాచార భాండాగారంగా పనిచేస్తుంది. ఈ రంగంలో పరిశుభ్రత, సుస్థిరతకు సంబంధించి అత్యున్నత ప్రమాణాలను పాటించే కార్యక్రమాలను గౌరవిస్తూ స్వచ్ఛతా అవార్డులను కూడా ప్రదానం చేశారు.

ఈ అన్ని కార్యక్రమాల ద్వారా బొగ్గు, లిగ్నైట్ గనుల్లో పనితీరును పెంచడానికి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి , భారతీయ బొగ్గు రంగం వృద్ధి, అభివృద్ధినీ నడిపించడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. దేశ ఇంధన అవసరాలను తీర్చడానికి స్థిరమైన పద్ధతులతోపాటు ఆశావహ దృష్టితో కార్యక్రమం ముగిసింది.

# వాణిజ్య బొగ్గు గనుల వేలం బిడ్లను తెరిచిన మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన సంబంధిత నామినేటెడ్ అథారిటీ ఈరోజు వాణిజ్య బొగ్గు గనుల 10వ రౌండ్ బిడ్లను అలాగే 9, 8వ రౌండ్ కోసం రెండో విడతలో దాఖలైన బిడ్లను తెరిచింది. ఈ రౌండ్ జూన్ 21న ప్రారంభమైంది, అయితే బిడ్డర్లకు తగినంత సమయం ఇవ్వడం కోసం బిడ్ సమర్పణ తేదీని రెండుసార్లు పొడిగించారు. ఆన్‌లైన్ బిడ్లను డీక్రిప్ట్ చేసి బిడ్డర్ల సమక్షంలో ఎలక్ట్రానిక్‌గా తెరిచారు. అనంతరం, ఆఫ్‌లైన్ బిడ్ పత్రాలు గల సీల్డ్ ఎన్వలప్‌లను కూడా బిడ్డర్ల సమక్షంలో తెరిచారు. బిడ్డర్ల కోసం ఈ మొత్తం ప్రక్రియను స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ రౌండ్ కోసం, ఆన్‌లైన్‌లో మొత్తం 45 బిడ్‌లు స్వీకరించగా, భౌతిక రూపంలో 44 బిడ్‌లు మాత్రమే వచ్చాయి.

10వ రౌండ్ కోసం కేటాయించిన 61 బొగ్గు గనుల్లో 16 గనుల కోసం మొత్తం 43 బిడ్‌లు వచ్చాయి. అలాగే, 9వ రౌండ్ రెండో విడత కోసం కేటాయించిన 5 గనులకు గానూ కేవలం 1 బిడ్ మాత్రమే దాఖలవగా, 8వ రౌండ్ రెండో విడత కోసం కేటాయించిన 1 గని కోసం ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు.

ఈ బిడ్లను మల్టీ-డిసిప్లినరీ టెక్నికల్ ఎవల్యూషన్ కమిటీ మదింపు చేయనుంది. సాంకేతికంగా అర్హత సాధించిన బిడ్డర్స్‌ను ఎమ్ఎస్‌టీసీ పోర్టల్‌పై నిర్వహించే ఎలక్ట్రానిక్ వేలం కోసం షార్ట్‌లిస్ట్ చేస్తారు.

# ఆ రెండు పార్టీలు ఒక్కటే..ఎమ్మెల్యే ధనపాల్




నిజామాబాద్, అక్టోబర్ 22:అబద్ధపు డోకా మాటలు చెప్పడంలో కేసీఆర్, మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే కాంగ్రెస్ ప్రభుత్వం దొందు.. దొందేనని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు అమలుకాని హామీలు ఇచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరి మాయమాటలు, కళ్ళబొల్లి కబుర్లు చెప్పి కాలం గడుపుతాం అంటే సహించేది లేదని హెచ్చరించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ? గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇస్తామని 10ఏళ్ళు యావత్ తెలంగాణ ప్రజలని మోసం చేసి ఒక్క ఇల్లు కూడా పేదోనికి ఇవ్వని ఘనత బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కు దక్కుతుందన్నారు. అలాంటి పాలన వొద్దని తెలంగాణ ప్రజలు మార్పు కావాలని కాంగ్రెస్ 6 గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, వందల హామీలను చూసి కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెడితే.. 100రోజుల్లో అమలు చేస్తానన్న హామీలు 10 నెలలు గడుస్తున్నా ఇచ్చిన గ్యారంటీలకు దిక్కు లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

నిజామాబాదు అర్బన్ లో కట్టిన ఇల్లు శిథిలావస్థకు చేరుకున్నాయని అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని, ఇందిరమ్మ ఇండ్లు దేవుదెరుగు కనీసం కట్టిన ఇళ్ళైనా బాగు చేసి అర్హులైన వారికి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అర్హులైన వారందరితో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

పొంగులేటి మాటలు పాల మీద పొంగులాగే ఉన్నాయని ఏద్దేవా చేసారు. రైతు రుణమాఫీ కూడా తూతూ మంత్రంగా చేసి డప్పులు కొడుతున్నారని, ఇంకా రుణమాఫీ కానీ రైతన్నలు ఎదురు చూస్తున్నారు.. మీరు చేస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ హామీ నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, కేసీఆర్ కి పట్టిన గతే నీకు పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పనిభారం తగ్గించాలంటూ పోలీసు కుటుంబాల ధర్నా



వరంగల్, అక్టోబర్ 22: వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

కానిస్టేబుళ్లను వెట్టిసాకిరి చేపిస్తూ.. కనీసం సెలవులు ఇవ్వకుండా.. కుటుంబానికి దూరం చేస్తున్నారని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని కానిస్టేబుళ్ల భార్యలు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు.

నిరసనను ఆపేందుకు ఆర్ టీ ఓ ఆఫీస్ నుండి మామునూరు బెటాలియన్ వరకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వ్ పోలీసుల బాధలను అర్థం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.. కొత్త డీజీ రావడంతోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# పిడుగుపాటుకు తండ్రి, కుమార్తె దుర్మరణం

ఖమ్మం, అక్టోబర్ 22: పిడుగుపాటుకు గురై తండ్రి కూతురు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని అడవి మద్దులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అడవి మదనపల్లి గ్రామానికి చెందిన చింతల లింగస్వామి ఆయన కుమార్తె పత్తి చేనులో మంగళవారం పత్తి తీస్తుండగా పిడుగు పడింది.. దీంతో తండ్రితో పాటు కుమార్తె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లింక్‌రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

హైదరాబాద్, అక్టోబర్ 22: కుత్బుల్లాపూర్‌లో లింక్‌రోడ్లను వెలుగులోకి తీసుకొచ్చి వాటిని వెంటనే అభివృద్ధి చేసి ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్డీసీఎల్), కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఎన్‌హెచ్-44 హనుమాన్ టెంపుల్ ఫాక్స్‌సాగర్ మీదుగా రాంరెడ్డినగర్ ఇండస్ట్రీయల్ ఏరియా వరకు రూ.29 కోట్లు, కైసర్ నగర్ హనుమాన్ రెండి ఎల్లమ్మ బండ, మహదేవపురం వెంటర్నరీ హస్పిటల్ వరకు రూ.30 కోట్లతో లింకురోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనుండగా దీంతో పాటుగా భూదేవిహిల్స్ లింకురోడ్డు పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. లింక్‌రోడ్లను సకాలంలో అభివృద్ధి చేయాలని, దీని ద్వారా ప్రధాన రోడ్లపై నిత్యం ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులకు సూచించారు.

## సర్వేకు ఒప్పుకోలేదని ఏఈఓలను సస్పెండ్ చేస్తారా.. : ప్రభుత్వంపై నిరంజన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 22:డిజిటల్ క్రాప్ సర్వేపేరుతో ఏఈఓలనువేధించడం తగవు. సర్వేకు ఒప్పుకోలేదని 150 మంది ఏఈఓలను సస్పెండ్ చేయడం దారుణమని మాజీ వ్యవసాయా శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ ఒక ప్రకటనలో ఖండించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పక్క రాష్ట్రాల్లో ఏజెన్సీలు, ఇతర శాఖల సహాయంతో కేంద్ర ఇచ్చే నిధుల ద్వారా సర్వే జరుగుతుంటే ఇక్కడ ఎందుకు ఏఈఓల నెత్తిన రుద్దుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మేలు చేసేందుకు ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈఓను నియమించాం.1500 కొత్త ఏఈఓల పోస్టులను సృష్టించి 2,601 రైతు వేదికలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. తెలంగాణ లో వ్యవసాయ విస్తరణ, సాగు పెంపు, అధిక దిగుబడి సాధించి దేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో ఏఈఓల పాత్ర ఎనలేనిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొత్త వారిని నియమించి సర్వే చేపట్టాలన్నారు.ఏఈఓల విజ్ఞప్తి మేరకు డిజిటల్ క్రాప్ సర్వేకు అవసరమైన సహాయకులను నియమించడం, ఏజెన్సీలకు పనిని అప్పగించాలని డిమాండ్ చేశారు.ఏఈఓలలో అత్యధికులు మహిళలు ఉన్నారు. క్రాప్ సర్వే పేరుతో వారిని నిర్మానుష్య వ్యవసాయ కమతాలకు ఎలాంటి రక్షణ లేకుండా ఎలా పంపిస్తారని? వారి భద్రతకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. వారు ఇప్పటికే 49 రకాల విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా వారి మీద బరువు ఎందుకు పెడుతున్నారు? ఔట్ సోర్సింగ్ మీద పనిచేస్తున్న వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం ఎంత వరకు సమంజసం... ప్రజా పాలన అంటే బెదిరింపులేనా అని మండిపడ్డారు.

## తెలంగాణ కథకులకు సాహిత్య అభిమానులకు విజ్ఞప్తి

బి.ఎస్. రాములుగారు విశాల సాహిత్య అకాడమి తరఫున 1998లో 'ఆధునిక కథా సరిత్సాగరం కరీంనగర్ జిల్లా కథలు' మొదటి సంపుటి వెలువరించారు. ఆ స్ఫూర్తితో అనేక జిల్లాల కథా సంకలనాలు వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. కరీంనగర్ జిల్లా కథలు 4 సంపుటాలు వెలువడ్డాయి. 2003లో 'భారతీయ సాహిత్యం తెలుగు కథలు' పేరిట అత్యున్నత ప్రమాణాలతో రెగ్జిన్ బైండ్‌తో 18 ఉత్తమ కథలతో మరో సంకలనం వెలువరించడం జరిగింది.

**"బి ఎస్ రాములు విశాల సాహితి కథా పురస్కార గ్రహీతల కథలతో సంకలనం**

విశాల సాహిత్య అకాడమి వివిధ అంశాల గురించిన 195కి పైగా పుస్తకాలతో పాటు, 30కి పైగా కథా సంకలనాలు వెలువరించారు. 1998 నుంచి ఇటీవలి వరకు ప్రతియేటా 'బి ఎస్ రాములు విశాల సాహితీ కథా పురస్కారాలు' ఎంపిక చేసి రచయితలకు బహూకరిస్తూ వస్తున్నారు. ఇటీవలే తన 75వ పుట్టిన రోజు వేడుకను రోజంతా జరిగిన వినూత్న సాహితీ సదస్సు నిర్వహించిన బి ఎస్ రాములు గారు ఇప్పుడు 'బి ఎస్ రాములు విశాల సాహితీ కథా పురస్కార గ్రహీతల కథలు'తో పాటు, మరో 40 కథలు కలిపి 75 కథలతో ఒక తెలంగాణా కథా సంకలనం తీసుకు రావాలని నిర్ణయించారు. ఇవి పావు శతాబ్దం తెలంగాణ కథలకు ప్రతినిధి కథలుగా ఉండాలి.

**పావు శతాబ్దపు తెలంగాణ కథల సంకలనం**

ఇలా తెలంగాణా జన జీవితాన్ని చక్కగా ప్రతిబింబించే, తెలంగాణా కథకుల కథన నైపుణ్యానికి ప్రతినిధిగా నిలువగలిగే కథలు వేయాలన్నది ప్రచురణ కర్తల సంకల్పం. ఈ సంకలనంలో ప్రచురణకోసం, విశాల సాహితీ కథా పురస్కారం పొందిన తెలంగాణా రచయితలు, తాము 2000 - 24 మధ్య రాసిన కథలనుండి ఎంపిక చేయాలని లక్ష్యం. ప్రముఖ సంకలనాల్లో ఇదివరకే వచ్చిన కథలు కాకుండా తమ మిగతా ఉత్తమమైన కథలు సూచించగలరని మనవి. ఒక రచయితది ఒక కథ మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. ఈ సంకలనం 2000-24 పాతికేళ్ల తెలంగాణ కథల సంకలనాలు మరిన్ని రావడానికి స్ఫూర్తి నిచ్చే విధంగా ఉండాలని ఆశయం. విశాల సాహితి అవార్డ్ పొందని ఇటీవలి యువ కథకుల కథలు కూడా కొన్ని ఎంపిక చేద్దాం.

**సాహిత్య అభిమానులకు ప్రత్యేక కానుక**

గత 25 ఏండ్లల్ల ఆయా తెలంగాణ రచయితలవి ఉత్తమోత్తమ కథగా మీరు ఏమి ఎన్నిక చేస్తారో చెప్పండి. ఆ కథ సంకలనంకు ఎంపికైతే ఆ సంకలనం మీకు బహుమతిగా ఆ రచయిత చేతులు మీదుగా అందుతుంది.

వాసిరెడ్డి నవీన్, సంగిశెట్టి శ్రీనివాస్, విశాలాంధ్ర, జ్వలిత, కొండపల్లి నిహారిణి, జూకంటి జగన్నాథం, తదితరులు వేసిన కథల సంకనాల్లో, జిల్లా కథా సంకలనాల్లో, వేసిన కథలు వద్దు. ఏ సంకలనంలో చేరని ఉత్తమ కథలు సూచించండి. ఇది వరకే సంకలనాల్లో చేరిన కథలెందుకు? శ్రమ దండగ! ఆయా రచయితలవైనా వేరే ఉత్తమోత్తమ కథలు వేద్దాం!!

యేటా కనీసం 25 మంచి కథలు లెక్కేసుకున్నా గత 25 యేళ్ళలో 625 కథలు మంచి కథలుగా, ఉత్తమ కథలుగా తెలంగాణా నుండి వెలువడ్డాయి. ఇలా వాటన్నిటిని ఒక్కచోట ఒకే సంకలనంలో తీసుకువచ్చే కృషి సాహిత్య సంస్థలు, తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పూనుకోవాలి. ఈ లోపు విశాల సాహిత్య అకాడమి అందుకు ఒక ప్రయత్నం ప్రారంభించింది.

**తెలంగాణ కథకులకు ముఖ్య గమనిక:**

బి ఎస్ రాములు విశాల సాహితి పురస్కారం పొందిన కథకుల ఉత్తమ కథలతో పాటు మరికొన్ని కథలు ఎంపిక చేసి 75 ఉత్తమ కథలతో 25 ఏండ్ల తెలంగాణ ఉత్తమ ప్రాతినిధ్య కథల సంకలనం తేవడం ప్రచురణకర్తల లక్ష్యం.

1. ఇందుకు పంపే కథలు రచయిత ఎందుకు 25 ఏళ్లలో తాను రాసిన ఉత్తమ కథల్లో ఒకటి అని భావిస్తున్నారో కొద్ది వాక్యాలు రాయాలి.
2. గత 25 ఏండ్లలో తాను చదివిన కథల్లో పది ఉత్తమ కథలు పేర్కొని అవి ఎందుకు నచ్చాయి వాటి విశిష్టత సంక్షిప్తంగా పేర్కొనాలి.
3. రచయిత తన పరిచయం, తమ రచనలు సంక్షిప్త బయోడేటా, చిరునామా, ఫోన్ నంబర్, చక్కని లేటెస్టు ఫోటో పంపాలి.
4. నేటి తెలంగాణ కథలు ఎలా ఉంటున్నాయి. ఎలా వస్తున్నాయి, ఎలా రావాలి అని అభిప్రాయం రాయాలి.
5.తెలంగాణ కథల్లో తెలంగాణ భాషే రాస్తున్నామా? రాయలేక పోతున్నామా? కారణాలు, సాధ్యాలు అభిప్రాయాలు రాయాలి.
6.పాఠ్య పుస్తకాలలో తెలంగాణ భాష, తెలంగాణ కథలు నవలలు, ఎంతమేరకు న్నాయి అభిప్రాయం రాయాలి.
7.ఇవన్ని "భారతీయ సాహిత్యం తెలుగు కథలు" పేరుతో విశాల సాహితి 2003 లో ప్రచురించిన సంకలనం సేకరించి ప్రచురించిన విధానమే తప్ప కొత్త ప్రయత్నం కాదు.
8.ఇలా ఈ కథల సంకలనం పావు శతాబ్దం కథల సమీక్ష మూల్యాంకనం చేస్తూ వెలువడుతుంది. సమకాలీన కథకులకు అది మార్గదర్శకంగా ఒక అవగాహన అందిస్తుంది. తెలంగాణ కథ ఎదగడానికి ఉపయోగపడుతుంది. కథలను సూచించేవారు ఆయా రచయితలు, సాహిత్య అభిమానులు ఆ కథలను ప్రచురించిన పత్రిక, పుస్తకం పేరుతోపాటు సంవత్సరం పేర్కొంటూ యూనికోడ్ ఫాంట్‌లోగాని, అను ఫాంట్ ప్రియాంకలో గాని, 15 పాయింట్ అక్షరాలతో ఓపెన్ ఫైల్, పిడిఎఫ్ ఫైల్ పంపాల్సి ఉంటుంది. అలా పంపలేని వాటిని పరిశీలించడం కష్టం.

పై వివరాలతో పాటు 25 ఏండ్ల తెలంగాణ కథలను 2024 అక్టోబర్ నెలాఖరులోగా పంపగలరు. -సంపాదక వర్గం.

విశాల సాహిత్య అకాడమి
వివరాలకు: 8331966987, 9701227207, 948855366, 9490682457, 9505504276, 9949424726, 6305166968. bsramulu@gmail.com

# అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్లో యస్జిఎఫ్ వాలీబాల్, జూడో, ఉషు పోటీలు ప్రారంభం



కరీంనగర్,అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి) క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక లాభాలు చేకూరుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో యస్.జి.ఎఫ్ అండర్ 19 చెస్, జడో, వాలీబాల్ మరియు ఉష పోటీల ప్రారంభోత్సవానికి యస్.జి.ఎఫ్ కార్యదర్శి మధు జాన్సన్ తో ముఖ్య అతిధిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా క్రీడలలో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా విద్యలో రాణించవచ్చని చెప్పారు. క్రీడా రంగాన్ని ఎంపిక చేసుకున్న వారు ఉద్యోగాలను సైతం సులభంగా సాధించడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా నిలవడంలో సఫలీకృతవ ంవుతారని చెప్పారు. అదేవిధంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని రకాలుగా నిపుణులైన అనుభవ జ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ ఇప్పిస్తూ వివిద స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేస్తున్నారు అని చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులను వారు పరిచయం చేసుకొని శుభాభినందనలు తెలిపారు. ఈ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజన్న సిరిసిల్ల జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాలలోని క్రీడాకారులు విచ్చేసి వారి యొక్క అసమాన ప్రతిభన చాటారు. ఈ కార్యక్రమంలో పీడీలు సరిత, సుష్మ, రాజశేఖర్, చందు, నారాయణ, విష్ణు, జూడో అఫిషియల్స్ ఎల్వి రమణ, సి. మహేందర్, ఎం.శ్రీధర్, సాయిచందర్, సాయిరామ్ యాదవ్, శ్యామ్, యోగ అఫిషియల్స్ వి. కిష్టయ్య, రామకృష్ణ, ఆనంద్, స్వరూప చారి, ప్రవీణ్, ఉషు అఫిషియల్స్, విద్యాసాగర్, విక్రమ్, శ్రీనివాస్, వాలిబాల్ అఫిషియల్స్ శ్రీనివాస్, సతీష్, అశోక్, అనురెడ్డి, చెస్ అఫిషియల్స్ అనూప్ కుమార్, సుజన్, కె. అరుణ్, ఆర్. రేవిక్, నితన్, పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నాచారంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 22: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.

నాచారంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలు, సమస్యల పరిష్కారానికి ప్రణాళికలపై చర్చించారు. నాచారంలో స్కూల్ బస్సులు, పెట్రోల్ ట్యాంకర్లు, గ్యాస్ లారీలు, తదితర వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటుందని, హబ్సిగూడ జంక్షన్ ప్రాంతంలో ఫ్రీలెఫ్ట్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు.

హబ్సిగూడ సిగ్నల్ ప్రాంతంలో రోడ్డును విస్తరించాలని ఎమ్మెల్యేను, అధికారులను కోరారు. యూటర్న్ సమస్యలతో కాలనీలకు వెళ్లే ప్రజలు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారని, వాటిపై తగిన చర్యలు చేపట్టాల న్నారు.

సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, నాచారం సీఐ రుద్వీర్‌కుమార్, కాప్రా ఈఈ నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఏకాగ్రతతో వృత్తి విద్యలో నైపుణ్యాన్ని సాధించాలి

## -భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

వరంగల్, అక్టోబర్ 22:విద్యార్థులు ఏకాగ్రతతో వృత్తి విద్యలో నైపుణ్యాన్ని సాధించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో ముఖాముఖీ అయ్యారు. ఈ సందర్భంగా ఆధునిక శిక్షణా కేంద్రం వర్క్ షాపు నిర్మాణ పనులను పరిశీలించి డిసెంబర్ మాసం చివరి నాటికి పూర్తయ్యే విధంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్క్ షాపులో ఏర్పాటు చేయనున్న పరికరాలను పరిశీలించారు. పనులకు ప్రత్యామ్నాయంగా పరికరాలు ఏర్పాటును పరిశీలించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఎం ఎస్ ఆఫీస్, ఫిట్టర్ ట్రేడ్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణా కేంద్రంలోని సౌకర్యాలు, శిక్షణా విధానాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎలా దోహదపడుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు శిక్షణలో పూర్తిస్థాయిలో మెలకువలు సాదించాలని సూచించారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, తమ భవిష్యత్తును మెరుగు పరచుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు శిక్షణా కేంద్రంలో అందుతున్న సదుపాయాలను, నైపుణ్యాలను అడిగి తెలుసుకుని, విద్యార్థుల స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ప్రవేశ పెట్టిందని, ఆధునిక శిక్షణా కేంద్రంలో 6 ట్రేడుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయుటకు అవకాశం ఉందని, మీ బంధు, మిత్రులకు తెలియచేయాలని సూచించారు.

# రా మ్యాంగో 'గార్లాండ్ - ఉత్సవ 2024' ప్రారంభం



హైదరాబాద్, అక్టోబర్ 22:భారతీయ సంప్రదాయాలకు చిహ్నంగా నిలిచిన రా మ్యాంగో 'గార్లాండ్ - ఉత్సవ 2024' హైదరాబాదులో ప్రారంభమైంది. ఈ ఉత్సవంలో పూలహారాలు ప్రధాన చిహ్నంగా నిలుస్తాయి. పూలతోరణాలు, మాలలు, మౌర్యుడి విగ్రహాలలో చూపిన రూపాల నుంచి ప్రేరణ పొందాయి. భారతీయ సంప్రదాయాలను ఆధునీకరించి చూపిస్తుంది. రాజస్తాన్ కంహయ్యా దంగల్ వంటి ప్రదర్శనలు వ్యక్తిగత అభిరుచి, సంప్రదాయాన్ని మిళితం చేస్తుంది. బ్రోకేడ్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ కలర్ అప్లిక్వే వంటి ప్రత్యేకతలు లెహెంగాలు, చీరలు, కుర్తాల్లో హైలైట్ గా చెప్పవచ్చు. గుల్కంద్ రాణి, పద్మ పింక్, మొగ్రా వైట్, పచ్చ మామిడి రంగులు కలవు. ఈ సేకరణ సాధారణంగా ఢిల్లీలో జరిగే వివాహం చుట్టూ తిరుగుతుంది. సంప్రదాయాల మిళితమై వ్యక్తిగత సాంస్కృతిక అర్థాలను ప్రతిబింబిస్తుంది. సంప్రదాయ విలువలు, ఆధునికతను కలిపి వేడుకలలో ప్రేమ, సాంస్కృతిక అర్థాలను చూపిస్తుంది. భారతీయ సంప్రదాయాలను ఆధునిక దుస్తుల్లో మిళితం చేస్తూ.. దుస్తులో ఒక కొత్త సాంస్కృతిక కథని చెప్పడం ప్రధాన లక్ష్యం. రా మ్యాంగో స్టోర్ బంజారా హిల్స్ లో కలదు.

# త్వరలో ముత్యాలమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, అక్టోబర్ 22: త్వరలో ముత్యాలమ్మ ఆలయంలోనూతన విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, బస్తీ ప్రజలతో మాట్లాడారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కుంభాభిషేకం, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు ఎలాంటి రాజకీయ ప్రమేయాలు లేకుండా బస్తీ వాసుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండాలనేది మా ఆలోచన అన్నారు. భక్తులు సంయమనం పాటించాలన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహిస్తామన్నారు.

# అనంతపురంలో భారీ వర్షం- వరద గుప్పిట్లో జనం



అమరావతి, అక్టోబర్ 22:అనంతపురంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ దెబ్బకు అనంతపురం నగరం సమీపంలోని ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాత్రి పూట భారీ వర్షాలు కురవడంతో గాఢనిద్రలో ఉన్న ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయంతో ప్రజలు వారి ఇళ్లపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూశారు.

అనంతపురం నగరం సమీపంలోని పండమేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సమాచారం తెలుసుకున్న అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనంతపురంలో ఒక్కసారిగా భారీ వర్షాలు పడటంతో ఆ పరిసర ప్రాంతాల్లోని కాలనీలు జలమయం అయ్యాయి. అనంతపురం కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. పండమేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఇదే సమయంలో అనంతపురం జిల్లాలోని కనగానపల్లి మండలం లోని ముక్తాపురం చెరువు నీరు పారడంతో ఆ వర్షపు నీరు బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై చేరుకుంది. వర్షం నీరు, చెరువు నుంచి ప్రవహించిన నీరు జాతీయ రహదారిపై చేరుకోవడంతో హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో వాహన సంచారం అస్తవ్యస్తం అయ్యింది. కొన్ని గంటలపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

సమాచారం తెలుసుకున్న అధికారులు, సిబ్బంది ఆ వర్షం నీరును తొలగించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. భారీ వర్షం రావడంతో పాటు చెరువులోని నీరు జాతీయ రహదారి మీదకు రావడంతో హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో సంచరిస్తున్న వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురైనారు. వాహనాలలో నుంచి బయటకు వెళ్ళలేక, ఆ వాహనాలు ముందుకు కదలలేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని గంటల తర్వాత ఆ వర్షం నీరును తొలగించారు.

# డీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్పొరేటర్లు..

అమరావతి, అక్టోబర్ 22:సెంట్రల్ నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాలకు చెందిన వైసిపి నాయకులు, కార్పొరేటర్లు వైసిపి వీడి టిడిపిలో చేరి ప్రజా సేవ చేసేందుకు ముందుకు వచ్చారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపి కేశినేని శివనాథ్ సమక్షంలో. 29వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీపతి, 61వ డివిజన్ కార్పొరేటర్ రమాదేవి, 63వ డివిజన్ కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మలతో పాటు భారీ సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వైసిపి వీడి టిడిపిలో చేరారు. వైసిపి వీడి టిడిపిలో చేరిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు వీరికి మద్దతుగా వచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలుకు ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా టిడిపి కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. వైసిపి నాయకులు ప్రజాసంక్షేమం కోరుకుంటూ టిడిపిలోకి రావటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యాక్రమాలు ప్రజలు ఎంతోగానో మెచ్చుకుంటున్నట్లు చెప్పారు. సెంట్రల్ నియోజకవర్గంలో వరద సమయంలో, వరద సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా చూపించిన చొరవ వైసిపి నేతల మన్ననలు కూడా పొందిందన్నారు. ఎన్డీయే కూటమి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలే చెప్పటం ఎంతో శుభపరిణామం అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ. విపత్తును ఎదుర్కొని ప్రజలను కాపాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు సేవలు ఆదర్శనీయమన్నారు. వరద బాధితులకు ఆహారం, మంచినీళ్ళు, ఇతర సౌకర్యాలు కల్పించటమే కాకుండా గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా గ్రౌండ్ లెవల్ లో వున్న వారికి 25 వేలు ,పై అంతస్తులో ఉన్న వారికి పది వేలు రూపాయల ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకోవటం జరిగిందన్నారు.

ఇది దేశంలో నే ఒక రికార్డు గా అందరూ చెబుతున్నారని పేర్కొన్నారు. వరద ప్రాంతాలలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన సేవలు చూసి వైసిపి నాయకులే చంద్రబాబు సేవలను మెచ్చుకోవటమే కాదు టిడిపి లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

# ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024లో ఏ ఐ -ఆధారిత ఆవిష్కరణలు

## 750కి పైగా వినియోగ కేసులు ప్రదర్శించబడ్డాయి



హైదరాబాద్, అక్టోబర్ 22:ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది స్టార్టప్‌లు మరియు విద్యా సంస్థలతో సహా విభిన్నమైన టెక్ మరియు టెలికాం కంపెనీల 900 టెక్నాలజీ వినియోగ సందర్భ దృశ్యాలను ప్రదర్శించినందున, ఈ సీజన్‌లో కీలకమైన ఫ్లేవర్‌గా నిలిచింది. , న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 4 రోజుల ఫోరమ్‌లో 750 ఏ ఐ-ఆధారిత వినియోగ కేసులతో సహా. ఐ ఎమ్ సి 2024కి తన ప్రారంభ పర్యటన సందర్భంగా, గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలలో భారతదేశ నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ, మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లైన ఆస్ట్రోమ్ ఈసిఫై సొల్యూషన్స్‌తో సహా సిగ్నల్‌చిప్, విసిగ్ నెట్‌వర్క్‌ల వంటి మార్గదర్శక స్టార్టప్‌లతో సంభాషించారు. విద్యా పరిశ్రమ భాగస్వామ్యాన్ని ప్రశంసిస్తూ ఐ ఎమ్ సి సి ఈ ఓ రామకృష్ణ పి., "ఐ ఎమ్ సి 2024లో ఐ ఐ టి లు ఇతర ఇంజనీరింగ్ కళాశాలలు విశ్వవిద్యాలయాలతో సహా అనేక విద్యా సంస్థల నుండి భాగస్వామ్యం కనిపించింది. వారు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వారి ఆవిష్కరణలను ప్రదర్శించడానికి పరిశ్రమల నాయకులు, పెట్టుబడిదారులు మరియు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో సంభాషించడానికి అవకాశాన్ని పొందారు. ఐ ఎమ్ సి2024 సరైన మెంటర్‌షిప్ అవకాశాలతో కళాశాల ల్యాబ్‌లలో పొదిగిన ఆలోచనలను మెరుగుపరచడానికి అనువైన సెట్టింగ్‌ను అందించింది. ఐ ఎమ్ సి2024 ఇఇ టి లు, ఐ ఐ ఎమ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల నుండి సంచలనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రదర్శించింది. భరత్ జెన్ వంటి ఎల్ ఎల్ ఎమ్ ద్వారా,ఐ ఎమ్ సి ఈ సంస్థల నుండి ఉద్భవిస్తున్న అత్యాధునిక పరిశోధన సాంకేతిక పురోగతిని హైలైట్ చేసింది, భారతదేశంలో టెలికాం మరియు సాంకేతికత యొక్క భవిష్యత్తును రూపొందించడంలో వారి పాత్రను ప్రదర్శిస్తుంది అని నిర్వాహకులు తెలిపారు . ఐ ఇ టి కాన్పూర్‌లో స్థాపించబడిన ఒక టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ద్వారా నిధులు పొందింది, సైబర్-ఫిజికల్ సిస్టమ్‌ల యొక్క సైబర్ సెక్యూరిటీని పరిష్కరించింది, కీలకమైన మౌలిక సదుపాయాలు, ఆటోమోటివ్‌లు డ్రోన్‌లపై ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024లో కీలక దృష్టి పెట్టింది.

# కరీంనగర్ జిల్లా బిజెపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ ఇంచార్జ్ గా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి



కరీంనగర్,అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి) మార్చి 2025 లో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కరీంనగర్ జిల్లా బిజెపి పట్టభద్రుల ఎన్రోల్మెంట్ ఇంచార్జ్ గా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రోజున బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి నియామకపు ప్రకటన చేశారు. హుజురాబాద్ మండలం చిన్న పాపయ్య పల్లి గ్రామానికి చెందిన నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పది సంవత్సరాలు ఏబీవీపీ ఫుల్ టైమర్ గా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా తదనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ ప్రభారీగా,పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ అసెంబ్లీ ప్రభారీగా పని చేశారు. ఈ సందర్భంగా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రుల ఎన్రోల్మెంట్ ఇన్చార్జిగా తనకు అవకాశం కల్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్కి,బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కి,బీజేపీ శ్రేణులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ల్లో పట్టభద్రుల ఎన్రోల్మెంట్ కోసం పూర్తి సమయం కేటాయించి పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# ఎస్జిఎఫ్ అండర్- 14లో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులకు మెడల్స్



కరీంనగర్,అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14 ఎస్జిఎఫ్ పోటీలలో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ కు చెందిన 9వ తరగతి చదువుతున్న ఉప్పుల పవన్ రాజ్ సిల్వర్ మెడల్, ఆరవ తరగతి చదువుతున్న జట్టి శ్రీనిధి బ్రౌంజ్ మెడల్, పోకల అనన్య సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మెడల్స్ గోదావరిఖని ఏ ఎస్పి రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు. తమ స్కూల్ పిల్లలకు మెడల్స్ రావడం సంతోషంగా ఉందని కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వసూపియా సంతోషం వ్యక్తం చేశారు.

# బ్రిక్స్ సదస్సు కోసం రష్యా వెళ్లే ముందు ప్రధాని చేసిన ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:బ్రిక్స్ 16వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనను ఆహ్వానించారని, ఈ రోజు నేను రెండు రోజుల పర్యటన నిమిత్తం కజాన్‌కు బయలుదేరుతున్నాను.

ప్రపంచ అభివృద్ధి ఎజెండా, సంస్కరించిన బహుళపక్షవాదం, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం, శక్తిమంతమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయటం, సాంస్కృతిక, ప్రజా అనుసంధానాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చలకు ముఖ్యమైన వేదికగా అవతరించిన బ్రిక్స్‌లో సన్నిహిత భాగస్వామ్యానికి భారతదేశం విలువ ఇస్తోంది. గత ఏడాది కొత్త సభ్యదేశాల చేరిక... ప్రపంచ అభ్యున్నతి ఎజెండాను, సమ్మిళితను పెంపొందించింది.

2024 జూలైలో మాస్కోలో జరిగిన వార్షిక శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో నా కజాన్ పర్యటన భారత్, రష్యాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

బ్రిక్స్ దేశాలకు చెందిన ఇతర నేతలను కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

# మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత వేగాన్ని పుంజుకోవాలన్న కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:నాగాలాండ్ లో జాతీయ రహదారులపై సమీక్ష సమావేశాన్ని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ సహాయ మంత్రులు శ్రీ అజయ్ టమ్‌టా, శ్రీ హర్ష్ మల్హోత్ర లతో పాటు నాగాలాండ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ టీ.ఆర్. జెలియాంగ్ కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్' లో ఈ కింది విధంగా తెలియజేశారు:

"నాగాలాండ్ లో 545 కిలోమీటర్ల మేర సాగుతున్న 29 జాతీయ రహదారి పథకాల పురోగతిని సమీక్షించాను. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ సహాయ మంత్రులు శ్రీ అజయ్ టమ్‌టా జీ, శ్రీ హెచ్.డీ. మల్హోత్ర జీ, నాగాలాండ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ టీ.ఆర్. జీలియాంగ్ జీలతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నాగాలాండ్ లో గతిశీల మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచడంలో ఆ సదుపాయాలు దీర్ఘకాలం పాటు మన్నేవిగాను, నిధులు ఏమంత ఎక్కువ ఖర్చు కాకుండా చూస్తూ పనుల వేగాన్ని పెంచాల్సిన అవసరాన్ని సమావేశంలో మేం స్పష్టం చేశాం. ఈ కార్యక్రమాలు అనుసంధానాన్ని పెంచడం, ఆ ప్రాంతంలో ఆర్థిక వృద్ధికి అండదండలను అందించడంతో పాటు భారతదేశపు సర్వతోముఖాభివృద్ధిలో నాగాలాండ్ ఇప్పటి కన్నా మిన్నగా తోడ్పాటును అందించేందుకు దోహదం చేయనున్నాయి"

మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ 'ఎక్స్' లోనే మరొక పోస్టులో... "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ దార్శనికతతో ప్రేరణను పొంది, నాగాలాండ్ లోని హైవేలు వృద్ధికి జీవనాడులుగా రూపొందుతున్నాయి. ప్రతి ఒక్క కొత్త రహదారితో భవిష్యత్కాలపు అనుసంధానానికి, సమృద్ధికి, ఇంకా ప్రగతికి బాట పడుతోంది." అని పేర్కొన్నారు.కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ న్యూఢిల్లీలో నిన్న నిర్వహించిన సమీక్ష సమావేశంలో తొలి రోజున ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు నాలుగింటిలో జాతీయ రహదారుల పనులు సాగుతున్న తీరును సమీక్షించారు.

# కుప్పకూలిన భవనం- ముగ్గురు మృతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోవడంతో ముగ్గురు మృతిచెందగా, మరో 13 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్న ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెస్క్యూ సిబ్బంది నలుగురిని కాపాడారు. ప్రమాద ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com